ఇంకుడు గుంతల్లో వ్యర్థాల తొలగింపు

వ్యర్థాలు తొలగించిన ఇంకుడుగుంత

అమీర్‌పేట్, మే 27 : జలమండలి ఆధ్వర్యంలో సనత్‌నగర్, అమీర్‌పేట్ డివిజన్లలోని ఇంకుడు గుంతలను వర్షాకాలానికి సిద్ధం చేసే పనులను చేపట్టింది. 'నమస్తే తెలంగాణ'లో 'ఇంకుడు గుంతలు వ్యర్థాల మయం' పేరుతో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సోమవారం నుంచి ఇంకుడు గుంతల్లో వ్యర్థాల తొలగింపు పనులను ప్రారంభించినట్లు జలమండలి ఎస్ఆర్ నగర్ డీజీఎం వంశీకృష్ణ వెల్లడించారు. రెండు డివిజన్లలో జలమండలి ద్వారా నిర్మించిన 30 ఇంకుడు గుంతలు ఉన్నాయని, వాటిని వర్షాకాలానికి పూర్తి స్థాయిలో సంసిద్ధం చేస్తామన్నారు.

హిమబిందుకు డాక్టరేట్

హిమబిందు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లిష్ విభాగంలో ఎస్. హిమబిందు డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ కేఎం ప్రవీణ పర్యవేక్షణలో 'క్వెస్ట్ ఫర్ ఐడెంటిటీ ఇన్ ది ట్రాన్స్‌లేటెడ్ వర్క్స్ ఆఫ్ మహాశ్వేతాదేవి, ఊర్మిళ పవార్, అరూప కలిత పతంగియా' అనే అంశంపై హిమబిందు పరిశోధన పూర్తి చేశారు. పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ ప్రదానం చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రస్తుతం హిమబిందు కామారెడ్డిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

అధికారుల నిర్లక్ష్యం.. తాగునీరు కలుషితం

- మాణికేశ్వరీనగర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు
- ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందంటున్న ప్రజలు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వెరసి మాణికేశ్వరీనగర్‌లో తాగునీరు కలుషితమై ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నది. ఒక వైపు మురుగునీరు రోడ్లపై పొంగి పొర్లుతుండగా మరోవైపు తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తుండడం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. దాంతో స్థానికులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. డ్రైనేజీనీటి నుంచే నడవడంతోపాటు దుర్గంధం భరించలేకపోతున్నామని వాపోతున్నారు.

డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతోందని, అంబేద్కర్ విగ్రహంసమీపంలోని ఒకే ఇంట్లో ఇటీవల నలుగురు అనారోగ్యం బారిన పడ్డారని, దీనికంతటికీ ప్రభుత్వ యంత్రాంగ నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు.

కలుషిత నీటిని చూపుతున్న స్థానికులు

మాణికేశ్వరీనగర్‌లో రోడ్డుపై పొంగిపొర్లుతున్న మురుగు నీరు

ఇప్పటికైనా సంబంధిత జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మాణికేశ్వరీనగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

డ్రైనేజీ పనులను వేగవంతం చేయండి

- జలమండలి జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్

చాచానెహ్రూనగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న జలమండలి జీఎం వినోద్‌కుమార్

బన్సీలాల్‌పేట్, మే 27 : చాచానెహ్రూనగర్ బస్తీలో తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జలమండలి జనరల్ మేనేజర్ కేఎస్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం బోయిగూడ సెక్షన్ డీజీఎం బ్రహ్మారెడ్డితో కలిసి ఆయన చాచానెహ్రూనగర్‌లో పర్యటించారు. బస్తీలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. మ్యాన్‌హోల్స్ మూతలు కొత్తవి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు కే. లక్ష్మీపతి డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లతోపాటు సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని త్వరగా పనులను పూర్తి చేయాలని ఆయన జీఎంను కోరారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

చిక్కడపల్లి,మే 27 : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. నగరంలో ప్రసిద్ధి గాంచిన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, ప్రభాకర్ దంపతులు, శంకర్ ముదిరాజ్, టెంపుల్ జనార్దన్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా..

- ఇద్దరు పరారీ, ఒకరు అరెస్టు
- 62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మారేడ్‌పల్లి, మే 27: రైలులో గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యుల్లో సికింద్రాబాద్ రైల్వే పోలీసులు ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు పరారయ్యారు. వారి బ్యాగుల్లో రూ. 15.50 లక్షల విలువైన 62కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన మిహిర్, చిదా, చాంద్‌కుమార్ నాయక్(30) ఒడిశాలోని మోహనా నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు ఎండు గంజాయిని సరఫరా చేస్తున్నారు. ఈనెల 27న ఉదయం సికింద్రాబాద్ రైల్వే ప్లాట్‌ఫామ్ నంబర్ 10లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసు సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ముఠా సభ్యులు అనుమానస్పందంగా కనిపించారు. వారి బ్యాగ్‌లను తనిఖీ చేయగా అందులో ఎండు గంజాయి కనిపించింది. అప్పటికే ఇద్దరు పారిపోగా.. చాంద్‌కుమార్ నాయక్‌ను పట్టుకుని బ్యాగుల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని విచారించగా ఒడిశా చెందిన ఇద్దరితోపాటు నాందేడ్ ప్రాంతానికి చెందిన మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

టోలిచౌకిలో అభివృద్ధి పనుల పరిశీలన

మెహిదీపట్నం, మే 27 : ప్రజలకు వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. సోమవారం నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్‌లలో రూ. 297 కోట్ల నిధులతో జరుగుతున్న సీవరేజీ పైప్ లైన్ల ఆధునీకీకరణ పనులను ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్, టోలిచౌకి ఎంఐఎం నాయకుడు మహ్మద్ హరూన్ ఫర్హాన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అల్ హస్నత్ కాలనీ, నిజాం కాలనీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముంపు సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ స్తంభంపై కూలిన తాటిచెట్టు

- తప్పిన ముప్పు

యూనివర్సిటీ రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ స్తంభంపై కూలిన తాటిచెట్టు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: ఈదురు గాలులకు విద్యుత్ స్తంభంపై తాటిచెట్టు కూలింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆదివారంరాత్రి వీచిన భారీ గాలులకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్ట్స్ కళాశాల రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ పక్కన ఉన్న తాటి చెట్టు దాని పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడిపోయింది. ఈ ధాటికి విద్యుత్ వైర్లు తెగి, స్తంభం నేలకూలింది. వాటి పక్కనే ఓయూ ఉద్యోగుల క్వార్టర్లు, మెయిన్ రోడ్డు ఉన్నప్పటికీ, ఎవరికీ ఏం కాకపోవడం విశేషం. అక్కడికి సమీపంలోనే మరిన్ని తాటిచెట్లు ఉండగా, వాటిని తక్షణమే తొలగించాలని స్థానికులు యూనివర్సిటీ అధికారులను కోరుతున్నారు.

చెత్త రీసైక్లింగ్ విధానంపై చిన్నారులకు అవగాహన

చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

అడ్డగుట్ట, మే 27 : యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వివిధ బస్తీలకు చెందిన చిన్నారులకు చెత్త రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించారు.అడ్డగుట్ట, అంబేద్కర్‌నగర్, రసూల్‌పురా, మడ్‌ఫోర్టు ప్రాంతాల నుంచి సుమారు 32 మంది చిన్నారులను సైనిక్‌పురిలోని చెత్త డంపింగ్ యార్డుకు తీసుకెళ్లి చెత్త సేకరణ, రీసైక్లింగ్ గురించి వివరించారు. యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీజీపీసీబీలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

టీజీపీసీబీ ఆడిటోరియంలో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అమీర్‌పేట్, మే 27 : జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'భూపునరుద్ధరణ.. ఎడారీకరణ.. కరువు నివారణ' అనే అంశాలపై ఈ ఏడాది పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టీజీపీసీబీ పర్యావరణ సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. టీజీపీసీబీ ఆడిటోరియంలో సోమవారం విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. భూమి, నీరు, గాలి, ప్లాస్టిక్, శక్తి, నీటి సంరక్షణ, మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెంపొందించడం వంటి వివిధ రకాల పర్యావరణ కార్యక్రమాల ద్వారా భూమిని రక్షించడానికి చేపట్టాల్సిన చర్యలపై 200 మందికి పైగా విద్యార్థులు తమ ఆలోచనలను డ్రాయింగ్ దార్వా ఆవిష్కరించారు.

విజేతలకు సనత్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో జూన్ 5న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు టీజీపీసీబీ సీనియర్ సోషల్ సైంటిస్ట్ డబ్ల్యూబీ ప్రసన్నకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఘనంగా బెల్లి లలిత వర్ధంతి

బెల్లి లలిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: ప్రజాస్వామిక తెలంగాణ కోసం గొంతెత్తిన బెల్లి లలిత 25వ వర్ధంతిని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బెల్లి లలిత తన ఆట, పాటలతో తెలంగాణ విముక్తి కోసం పనిచేశారని కొనియాడారు. ఆమె కలలుగన్న ప్రజాస్వామిక తెలంగాణ సాధనకు విద్యార్థి నాయకులు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కాశీం, బెల్లి లలిత కుమారుడు సూర్యప్రకాశ్, విద్యార్థి నాయకులు కోట శ్రీనివాస్ గౌడ్, రంజిత్, సైదులు, శరత్‌నాయక్, భద్రి, ఉదయ్, సుమంత్, సతీశ్, శ్రవణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

సికింద్రాబాద్‌లో నిరాశ్రయులకు భోజన పాకెట్లు అందజేస్తున్న సాయికృష్ణ

సికింద్రాబాద్, మే 27: పేదలకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని సీతాఫల్‌మండికి చెందిన సంఘ సేవకుడు బంగారి సాయికృష్ణ అన్నారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపైన నివాసం ఉంటున్న అనాథలు, నిరాశ్రయులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమాజ సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

బీజేపీ నేతపై కేసు

అడ్డగుట్ట, మే 27 : అక్రమంగా ఇతరుల స్థలంలోకి చొరబడి విద్యుత్ మీటర్ బిగించిన బీజేపీ నేత, ఫిషరీస్ బోర్డు మాజీ సభ్యుడిపై ట్రెస్‌పాసింగ్ కేసు నమోదైన సంఘటన తుకారాం గేట్ పోలీస్‌స్టేషన పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అంజనేయులు కథనం ప్రకారం... తుకారాంగేట్ రియో పాయింట్ ప్రాంతానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు జనార్దన్ అడ్డగుట్టలోని నరేశ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా చొరబడ్డాడు. అంతేకాకుండా అతడి స్థలంలో విద్యుత్ మీటర్ కూడా బిగించాడు. దీంతో స్థలం యజమాని నరేశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రెస్‌పాసింగ్ కింద పిర్యాదు చేశాడు. పోలీసులు జనార్దన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు పాత నేరస్తుల అరెస్టు

ఖైరతాబాద్, మే 27 : ముగ్గురు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఇందిరానగర్ కాలనీకి చెందిన పొదిల ప్రకాశ్ రాజ్ అలియాస్ డాలర్ పింటు, కార్వాన్ తాళ్ల గడ్డకు చెందిన జాదన్ రోహన్ సింగ్ అలియాస్ ఫన్నీ రోహన్, మాదాపూర్ సాయినగర్‌కాలనీ, అయ్యప్ప సొసైటీకి చెందిన హన్మంత్ నితిన్ గౌడ్ అలియాస్ నితిన్ పాత నేరస్తులు. డాలర్ పింటుపై ఇప్పటికే ఖైరతాబాద్ పీఎస్‌లో రౌడీషీట్ తోపాటు సైఫాబాద్ పీఎస్ పరిధిలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ,. సెక్షన్ 302, 341, 504, 506,435, 290, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులున్నాయి. రోహన్‌సింగ్‌పై జగద్గిరిగుట్ట పీఎస్ పరిధిలో సెక్షన్ 302 రెడ్ విత్ 34, సెక్షన్ 3(2)(వి) ఆఫ్ ఎస్సీ, ఎస్టీ పీవోఏ కింద కేసులు నమోదయ్యాయి. హన్మంత్ నితిన్‌గౌడ్‌పై సైబరాబాద్, ఫిల్మ్‌నగర్ పీఎస్‌లో ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులున్నాయి.

గంజాయి సేవిస్తూ.. యువతను టార్గెట్ చేసే క్రమంలో

ముగ్గురు రాత్రివేళ్లలో సంచరిస్తూ గం జాయి సేవిస్తూ.. యువతను టార్గెట్ చేసి అలవాటు చేసి బానిసలుగా మార్చి డబ్బులు దో చుకుంటున్నారు. అడ్డువచ్చిన వారిపై దాడి చేసేందుకు రోహన్ సింగ్ ఓ డ్యాగర్ (కత్తి) వెంట పెట్టుకొని తిరుగుతున్నాడు. వీరి ఆగడాలపై నిఘా పెట్టి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు ముగ్గురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కిలో వంద గ్రాముల గంజాయి, డ్యాగర్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

చాచానెహ్రూ సేవలు చిరస్మరణీయం

జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ దంపతులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: భారత తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ ప్రగతికి మార్గం చూపిన దార్శనికుడు నెహ్రూ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో సైతం ఆయన ముందుండి పోరాడారని గుర్తు చేశారు. తొలి ప్రధానిగా దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఆయన పాలనా దక్షత ఎంతో గొప్పదని కీర్తించారు. కార్యక్రమంలో మోతె శోభన్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

చాచానెహ్రూనగర్‌లో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

చాచానెహ్రూ నగర్‌లో...

బన్సీలాల్‌పేట్ : భారత తొలి ప్రధాని, భారతరత్న పండిత్ జవహర్ లాల్ నెహ్రూ 60వ వర్ధంతిని సోమవారం కాంగ్రెస్ నాయకుడు డి.శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూనగర్‌లోని నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. డివిజన్ అధ్యక్షుడు ఐ.చిరంజీవి, నాయకులు మల్లం రమేశ్, కృష్ణ, వేదప్రకాశ్ యాదవ్, కొండల్, శంకర్, రమేశ్‌బాబు, జగదీశ్, శ్యామ్, శంకర్, రాజేందర్, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: ఉస్మానియా యూనివర్సిటీలో ఈఎస్ఐ, ఈపీఎఫ్ సరిగా అమలు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ యూనివర్సిటీ అధ్యక్షుడు టి. మహేందర్ డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం పలువురు నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓయూలోని మెస్‌లు, హాస్టళ్లలో కలిపి వివిధ కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో 382 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరంతా టెండర్ తీసుకుని ఏడాది గడుస్తున్నా.. ఇప్పటికీ ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయకపోవడం దారుణమైన విషయమన్నారు.

కొన్ని నెలలుగా సమయానికి వేతనాలు సైతం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దాంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వేతనాలు ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌ను సక్రమంగా అమలు చేయాలని కోరారు. లేనియెడల కాంట్రాక్టర్ల లైసెన్సులు రద్దు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు సీతారాం, శ్రీనునాయక్, నాగరాజు, నరేశ్, శివ, బాలకృష్ణ, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

వార్షిక బ్రహ్మోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 27 : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ శ్రీవెంకన్న గుట్టలో కొలువుదీరిన శ్రీపద్మావతి గోదాసమేత శ్రీసాలాగ్రామ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ రెండో రోజు పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు. మరో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని కమిటీ సభ్యులు వెల్లడించారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

మల్కాజిగిరి, మే 27: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానికులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లవంటి మౌలిక సదు పాయాలు కల్పిస్తామని అన్నారు. అధికారులతో సర్వే చేయిస్తామని పేర్కొన్నారు.

మార్కులు పెరిగిన ఇంటర్ విద్యార్థులకు ఫీజు వాపస్ చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27: రాష్ట్రంలో ఇంటర్ మూల్యాంకన తప్పిదాలు కొనసాగడం అత్యంత దౌర్భాగ్యమని ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల అనంతరం ఏటా పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం హేయమన్నారు. ఊహించని మార్కుల తగ్గుదలతో వేల మంది విద్యార్థులు వేల రూపాయలు వెచ్చించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. మూల్యాంకనంలో తప్పులు జరిగి మార్కులు పెరిగిన సందర్భంలో వారికి ఫీజు వాపసు చేయకుండా బోర్డు విస్మరిస్తోందని మండిపడ్డారు. బోర్డు అధికారుల తప్పులు విద్యార్థులకు శిక్షగా మారాయని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రీవాల్యుయేషన్‌లో మార్కులు పెరిగిన విద్యార్థులకు ఫీజు వాపసు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

చిక్కడపల్లి, మే 27 : ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ ఆపాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. అశోక్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అశోక్‌రెడ్డి మాట్లాడారు.